**ఇందూరులో 82శాతం వరి సాగే..**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం సాగు విస్తీర్ణంలో అగ్రభాగం వరి పంటకే రైతులు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ శాఖ వెల్లడించిన అంచనాల ప్రకారం జిల్లాలో 4లక్షల 23వేల 32 ఎకరాల్లో వరినే సాగు చేయబోతున్నట్లుగా తేల్చారు. కానీ..ఇంత వరకు కేవలం 46వేల ఎకరాల్లోనే వరినాట్లు నోచుకున్నాయి. మక్కజొన్న 39,557ఎకరాల్లో సాగు అంచనాలుంటే అత్యధికంగా 35వేల ఎకరాల్లో సాగైంది. సోయాబీన్ 50,995 ఎకరాలకు 17వేల ఎకరాల్లో విత్తారు. 3273 ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనాలుంటే 237 ఎకరాల్లోనే సాగైంది. కామారెడ్డి జిల్లాలో వ్యవసాయ శాఖ వానాకాలంలో 5లక్షల 18వేల ఎకరాల్లో పంటల సాగు ప్రణాళికలను సిద్ధం చేసింది. ప్రధాన పంటగా వరినే అత్యధిక మంది రైతులు 3లక్షల 15వేల 965 ఎకరాల్లో సాగు చేయబోతున్నట్లుగా అంచనా వేయగా ఇప్పటి వరకు 9వేల ఎకరాల్లోనే నాట్లువేశారు. వరి తర్వాత అధిక మొత్తంలో సోయాబీన్, పత్తి, మక్కజొన్న పంటలతోపాటు అపరాల సాగుకు రైతులు దృష్టి పెట్టే అవకాశాలున్నట్లుగా వ్యవసాయ శాఖ గణాంకాలు ఉండగా ఇప్పటి వరకు మక్కజొన్న 57,617 ఎకరాలకు 9వేల ఎకరాలకు, 85,444 ఎకరాల్లో సోయాబీన్ అంచనాలుంటే కేవలం 13వేలకే పరిమితమైంది. పత్తి ఈసారి కామారెడ్డి జిల్లాలో 28వేల 780 ఎకరాల్లో సాగుకు అవకాశాలున్నట్లుగా వ్యవసాయ శాఖ పేర్కొనగా నేటివరకు 7వేల ఎకరాలకు పరిమితమైంది. అపరాల సాగు సైతం ప్రాధాన్యత స్థాయిలో ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొనప్పటికీ వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

## వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలి...

**ప్రస్తుతం** వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రైతులెవ్వరూ గందరగోళానికి గురి కావాల్సిన అవసరం లేదు. పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు ఏఈవోలు, ఏవోలు సిద్ధంగా ఉన్నారు. వ్యవసాయాధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు స్వీకరించి పంటల సాగులో ముందుకు వెళ్లాలి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే రైతుభరోసా పథకానికి సంబంధించి ఇప్పటి వరకు మాకు ఎలాంటి మార్గదర్శకాలు జారీకాలేదు.

**- వాజిద్ హుస్సేన్, నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధికారి**



# 'సాగు'త లేదు!

- వానాకాలంలో గడ్డు పరిస్థితులు
- వానల్లేక ముందుకు పడని పంటలు
- బోర్ల కింద సాగుకే అన్నదాతల ఆసక్తి
- భారీగా వ్యవసాయ శాఖ అంచనాలు

నిజామాబాద్, జూన్ 26(నమస్తే తెలంగాణ ప్రతినిధి): వానాకాలం మొదలైనప్పటికీ వర్షాలు లేక ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా పంటల సాగు దాపురించింది. వ్యవసాయ శాఖ సాగు అంచనాలను సిద్ధం చేసింది. నిజామాబాద్ జిల్లాలో 5.39లక్షల ఎకరాల్లో పంటల సాగు ఉంటుందని పేర్కొనగా ఇందులో ఇప్పటి వరకు స్వల్పంగానే సాగైంది. కామారెడ్డి జిల్లాలో 5.18లక్షల ఎకరాల్లో పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసినప్పటికీ రైతులు మాత్రం పంటలు వేసేందుకు నడుంకట్టిన సందర్భాలే కనిపించడం లేదు. వర్షాభావ పరిస్థితులు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లోనూ నీటి నిల్వలు అడుగంటాయి. చెరువులు, కుంటల్లోనూ జలకళ తప్పింది. దీంతో వానలు తప్పా మరే ఆధారం లేకుండా పోయింది. కేసీఆర్ ఉన్నప్పుడు ఎస్సారెస్పీకి రివర్స్ పంపింగ్ ద్వారా నీళ్లను ఎత్తిపోసి చెరువులు, కుంటలు నింపారు. కాళేశ్వరం జలాలను నిజాంసాగర్‌కు హల్దీ కాలువ ద్వారా పంపించి చారిత్రక ప్రాజెక్టు కింద ఆయకట్టుకు ఊపిరిపోసేది. కానిప్పుడు కాంగ్రెస్ పాలకుల్లో అలాంటి చొరవే కానరావడం లేదు. బోర్ల కింద సాగుకు రైతులు భయపడాల్సి వస్తున్నది. భూగర్భ జలం కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో ఏంచేయాలో తెలియక గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు.

### ప్రభావం చూపుతున్న పెట్టుబడి సాయం..

వర్షాలు లేకపోవడంతోపాటు పెట్టుబడి సాయం అందివ్వకపోవడం కూడా పంటల సాగు విస్తీర్ణం పెరగకపోవడానికి ప్రధానంగా కారణంగా తెలుస్తున్నది. అత్యధిక మంది రైతులు సన్న, చిన్నకారు వర్గాలే ఉన్నారు. వీరికి పంటల సాగు కోసం పెట్టుబడికి పైసల్లేక విలవిల్లాడుతున్నారని తెలిసింది. రైతుభరోసా కింద ఏటా ఎకరానికి రూ.15వేలు ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ ఊసే ఎత్తడం లేదు. గత యాసంగి సీజన్‌లో అరకొరగా పెట్టుబడి సాయం ఇచ్చినట్లే ఈసారి కూడా అలాంటి ఏర్పాట్లే చేస్తున్నది. సమయానికి పెట్టుబడి సాయం అందివ్వకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఓవైపు అప్పులు చేసేందుకు ధైర్యం చాలక, పెట్టుబడి సాయం రాక రైతులు సాగుకు దూరంగా ఉంటున్న సందర్భాలు కూడా వెలుగు చూస్తున్నాయని తెలుస్తున్నది. కేసీఆర్ హయాంలో రైతుబంధు పథకం ద్వారా కర్షకుల బతుకులు గాడిలో పడ్డాయి. అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలకే పన్నులు రూపంలో రైతులు చెల్లించే పరిస్థితి ఉండేది. అలాంటిది కేసీఆర్ చొరవతో పెట్టుబడి సాయం కింద నగదు నేరుగా రైతులకే అందించే ఏర్పాటు జరిగింది. భూమి విస్తీర్ణాన్ని అనుసరించి ఎకరానికి రూ.5వేల చొప్పున ఏటా రెండుసార్లు మొత్తం రూ.10వేల చొప్పున ఎకరానికి రైతుబంధును అందించేది.

### చినుకు పడదు.. చింత తీరదు..

గాంధారి, జూన్ 26: గాంధారి మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో నాలుగైదు రోజులుగా వర్షం కురియక పోవడంతో విత్తనాలు విత్తుకున్న రైతులు వాటిని కాపాడేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. గాంధారిలో నాలుగు రోజుల క్రితం మోస్తరు వర్షం కురవడంతో చాలా మంది రైతులు మక్కజొన్న, సోయా, పత్తి, కంది తదితర విత్తనాలను విత్తుకున్నారు. నాలుగైదు రోజులు గడుస్తున్నా చినుకు రాలకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు వేసిన విత్తనాలను కాపాడుకునేందుకు డ్రిప్ స్ప్రింక్లర్లతో పంట భూములకు తడి అందిస్తున్నారు. వరుణ దేవుడు కరుణించాలని ఆకాశం వైపు చూస్తున్నారు.



మాధవపల్లి సమీపంలో స్ప్రింక్లర్లతో భూమిని తడుపుతున్న రైతు

# రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలి

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

కామారెడ్డి, జూన్ 26 : వ్యవసాయంతో పాటు లాభదాయకమైన పాడిపరిశ్రమ, కోళ్లు, చేపల పెంపకం,ఆయిల్ పామ్, తోటల పెంపకం వంటి వాటిపై రైతులు దృష్టిసారించి ఆర్థికంగా వృద్ధి సాధించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని కళాభారతి ఆడిటోరియంలో డెయిరీ టెక్నాలజీ కళాశాల, జాతీయ మాంస పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కిసాన్‌మేళాను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయ వనరులను మెరుగుపరచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా వివిధ పథకాలు అమలు చేస్తూ సబ్సిడీ అందిస్తున్నదని అన్నారు. కిసాన్ మేళా ద్వారా రైతులకు వ్యవసాయంలో సూచనలు, మెలకువలు, సాంకేతిక సలహాలు, శాస్త్ర పరిశోధన ఫలాలు అందిస్తూ అవగాహన కల్పిస్తున్నదని అన్నారు. రైతులు వాటిని ఆకలింపు చేసుకొని సంపద పెంపొందించుకునే దిశగా ఎదగాలని కోరారు. అంతకుముందు పశు సంవర్ధక, ఉద్యాన, మత్స్య శాఖ, విజయ డెయిరీ, పరిశ్రమల శాఖ,నాబార్డు తదితర సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జాతీయ మాంస పరిశోధన సంస్థ డైరెక్టర్ బర్బుద్దే, కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్‌చంద్ర, కోరుట్ల పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్, ఎస్ఆర్ఎంఐ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ బస్వారెడ్డి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ నందకుమారి, కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.




కిసాన్‌మేళాలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# సారు పాలనలో.. సవ్యంగా కరెంటు

- సమైక్యపాలనలో కరెంటు బాధలు చూసినం
- స్వరాష్ట్రంలో కేసీఆర్ నాణ్యమైన విద్యుత్ ఇచ్చిండు

**సమైక్యపాలనలో** కరెంటు బాధలుపడ్డాం. పొద్దుగాల్ల కరెంటు పోతే పొద్దుగూకంగ వస్తుండె. మధ్యలో కరెంటు లేక మా పనులు సరిగ్గా నడ్వకపోతుండె. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ సారు హయాంల కరెంటు బాధ పోయింది. ఆయన పాలనలో 24గంటలపాటు కరెంటు ఉంటుండె. కరెంటు ఇచ్చేటప్పుడు ఎక్కడ ఏ సమస్య వచ్చినా తొందరగా తీరుతుండె. అంత మంచిగ చేసిండు. అసొంటి సారుపై నిందలు మోపొద్దు. సవ్యమైన కరెంటు ఇచ్చి రంది లేకుండా చేసిండు.. అని ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అభిప్రాయం వ్యక్తంచేశారు. కరెంటు సరఫరాపై వారి మనోగతాన్ని వివరించారు.







### జిరాక్స్ సెంటర్‌ను మంచిగా నడిపించిన..

జిరాక్స్ సెంటర్‌కు కరెంటు తప్పనిసరి. కేసీఆర్ సార్ హయాంలో 24గంటల కరెంటు ఉంటుండె. జిరాక్స్ సెంటర్‌తోపాటు ఫొటో స్టూడియో ఇప్పటికీ నడుపుతున్నాను. కరెంట్ కోతలు లేకుంటే పని సజావుగా, సులభంగా సాగుతుండె. దీంతో కస్టమర్లకు ఏసమస్య తలెత్తేది కాదు. కస్టమర్లతోపాటు నేనూ సంతోషంగా నడిపేవాన్ని.


**- జక్కలి శ్రీకాంత్, జిరాక్స్ సెంటర్, ఎడపల్లి.**



### కరెంట్ పోయే సమస్యే లేకుండె..

ఎడపల్లి, జూన్ 26: మాజీ సీఎం కేసీఆర్ హయాంలో కరెంట్ ఫుల్ టైమ్ 24గంటలు ఇస్తుండె. కరెంట్ పోయే సమస్యే లేకుండె. మీ సేవ అంటే కరెంట్ మీదనే ఆధారం ఉంటుండె. కేసీఆర్ పాలనలో కరెంటుకు ఏం ఇబ్బంది లేకుండె. నాణ్యమైన కరెంటు వస్తుండె. ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా కరెంటును ఇచ్చిండు.

**- కేసరి సందీప్, మీ సేవా సెంటర్, ఎడపల్లి**



# పాఠశాల పక్కన స్థలాన్ని అందిస్తాం..

**విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు**




లింగంపేట, జూన్ 26: భూమి కోసం దాతలు చేసిన నిరసనపై నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామంలో బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. 1985 నుంచి 1992వ సంవత్సరం వరకు ప్రభుత్వ పాఠశాల అని రికార్డుల్లో నమోదై ఉన్నట్లు తహసీల్దార్ నరేందర్ తెలిపారు. 1992 నుంచి 2024వరకు భూదాతలపై రికార్డుల్లో నమోదైనట్లు పేర్కొన్నారు. పాఠశాల భవనం పక్కన ఉన్న ఖాళీ స్థలం సర్వే చేయించి బాధితులకు అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

**తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌ను** ఎర్రవెల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో బుధవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ఆర్మూర్ మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్, రైల్వేబోర్డు మెంబర్ అక్లూర్ నర్సారెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

*- ఆర్మూర్‌టౌన్, జూన్26*



# ఏబీవీపీ నాయకుల అరెస్టు

**ప్రభుత్వ పాఠశాల బంద్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు**



ప్రభుత్వ పాఠశాలను బంద్ చేసేందుకు వచ్చిన వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్/ఖలీల్‌వాడి, జూన్ 26: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునివ్వగా.. తెరిచి ఉన్న ప్రభుత్వ పాఠశాలను బంద్ చేసేందుకు యత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న శంకర్‌భవన్ ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయించేందుకు ఏబీవీపీ నాయకులు వచ్చారు. విషయం తెలుసుకున్న రెండోటౌన్ పోలీసులు పాఠశాలను బంద్ చేసేందుకు వచ్చిన ఎనిమిది మందిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా విద్యాసంస్థలను బలవంతంగా బంద్ చేయించేందుకు ప్రయత్నించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని రెండురోజుల క్రితం సీపీ కల్మేశ్వర్ సింగేనవార్ హెచ్చరించిన విషయం తెలిసిందే.

# భీమ్‌గల్ సీఐగా నవీన్

- ఐదు నెలల వ్యవధిలోనే మార్పు
- చర్చనీయాంశంగా సీఐ బదిలీ వ్యవహారం



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న నవీన్

భీమ్‌గల్, జూన్ 26: భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నవీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సీఐగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను అధికారులు ఆకస్మికంగా ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఐజీ కార్యాలయంలో వెయిటింగ్‌లో ఉన్న సీఐ నవీన్.. భీమ్‌గల్ వచ్చి బాధ్యతలు తీసుకునే వరకు తనను బదిలీ చేశారనే విషయం విధులు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్‌కు తెలియకపోవడం గమనార్హం. వచ్చిన ఐదు నెలల్లోనే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా బాధ్యతలు చేపట్టిన సీఐ నవీన్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

# కనీస వేతనం కోసం..

నూతన పీఆర్సీలో కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు.

*- కామారెడ్డి, జూన్ 26*

